# మా సహనాన్ని పరీక్షించొద్దు

- కాంగ్రెస్ ప్రభుత్వానికి వేముల హెచ్చరిక
- ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ మీద దాడి హేయనీయం
- ఇది ప్రజా పాలన కాదు..రౌడీ పాలన!
- రేవంత్ సర్కారుపై ప్రశాంత్‌రెడ్డి ధ్వజం



మోర్తాడ్, మే 26 : రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తున్నదా..లేక రౌడీ పాలన నడుస్తున్నదా? అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని ఆయన సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ గూండాల దాడిని అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రతిరోజూ ఆదివారం కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన పోలీసులకు సూచించారు.

**ఓర్వలేకనే కేటీఆర్‌పై కుట్ర**

ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రౌడీపాలన చేస్తున్నదని, పోలీసులను అడ్డం పెట్టుకుని నియంత పాలన నడిపిస్తున్నదని వేముల విమర్శించారు. దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజల్లో ప్రభుత్వ తీరును ఎండగడున్నారన్నారు. దాంతో బీఆర్ఎస్‌కు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తుండడంతో ఓర్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు తెర లేపిందని విమర్శించారు. గూండాలు చేస్తున్న దాడులను ఆపాల్సిన పోలీసులే బీఆర్ఎస్ శ్రేణులపై లాఠీచార్జి చేయడం విడ్డూరమన్నారు. ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని ధ్వజమెత్తారు.

**నాడు కేసీఆర్ ఫొటో పెట్టుకున్నారా?**

బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోటో పెట్టుకున్నారా? అని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. మరీ ఈనాడు మా ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డి ఫొటో ఎందుకు పెట్టుకోవాలో చెప్పాలని నిలదీశారు. ఏ ప్రొటోకాల్ ఉందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తన అధికారిక చాంబర్‌లో ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఫొటోలు పెట్టుకున్నారని ప్రశ్నించారు. పదేండ్ల అధికారంలో ఉన్నపుడు బీఆర్ఎస్ పార్టీ పూర్తి ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలా వ్యవహరించి ఉంటే కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై తిరిగే వారే కాదని, నేడు అధికారంలోకి వచ్చే వారే కాదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల మంచితనాన్ని చేతకాని తనంగా భావిస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. హామీలు అమలు చేయకపోవడంపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై, శ్రేణులపై దాడులు చేయాలని చూస్తే సహించేది లేదని పేర్కొన్నారు. అటెన్షన్, డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ.. మా సహనాన్ని పరీక్షించొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# విద్యుత్ షాక్‌తో అటెండర్ మృతి

భిక్కనూరు, మే 26 : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అటెండర్ విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. స్థానిక ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సిద్దరామేశ్వర్ నగర్ గ్రామ శివారులో ఉన్న గురుకుల పాఠశాలలో దోమకొండ లింగం (38)అటెండర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఎలక్ట్రిషియన్ ఆరోజ్‌తో కలిసి హాస్టల్ లోని వాటర్ ట్యాంక్‌ను క్లీన్ చేయడానికి పైకి ఎక్కాడు. ఇనుప నిచ్చెనను వాటర్ ట్యాంక్‌పైకి తీసుకుంటున్న క్రమంలో నిచ్చెన పైనున్న విద్యుత్ తీగలకు తగలడంతో షాక్ తగిలి ఇద్దరు కిందపడిపోయారు. వారిని వెంటనే 108 అంబులెన్సులో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు లింగం అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఎలక్ట్రిషియన్ ఆరోజ్‌కు గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో వీణ పాఠశాలను సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



లింగం (ఫైల్)

## రెండు సీజన్లలో మొండిచేయి

అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15వే చొప్పున పెట్టుబడి సాయం చేస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించింది. రైతు డిక్లరేషన్ పేరిట ఊదరగొట్టింది. కానీ, అధికారంలోకి రాగానే కాంగ్రెస్ మార్క్ మోసానికి తెర లేపింది. 2023 డిసెంబర్ 7న అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి తదనంతరం యాసంగి 2023, వానాకాలం 2024 సీజన్లలో పెట్టుబడి సాయం ఇవ్వకుండా రైతాంగానికి పంగనామాలు పెట్టారు. మొన్నటి యాసంగిలో రైతుభరోసా పథకాన్ని మొక్కుబడిగా ప్రారంభించారు. ఎకరాకు రూ.15వేలు ఇస్తామని రూ.12 వేలకే కుదించారు. అదైనా అందరికీ ఇచ్చారా? అంటే అదీ లేదు. యాసంగి ముగిసినప్పటికీ ఉమ్మడి జిల్లాలో సగం మంది రైతులకు పెట్టుబడి సాయం రాలేదు. ఇప్పుడు మరో వారంలో వానకాలం మొదలు కానుంది. పెట్టుబడి సాయం ఎదురుచూస్తున్న రైతాంగం ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నది. కేసీఆర్ ఉన్నప్పుడు ఠంచన్‌గా రైతుబంధు వచ్చిందని, కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఎగవేతలతోనే సరిపెడుతున్నదని రైతులు మండిపడుతున్నారు.

### రైతును ఆదుకోవడంలో సర్కారు పూర్తిగా విఫలం



కోటగిరి, మే 26: వానకాలం ప్రారంభమైంది. రైతు భరోసా ఇంతవరకూ ఊసే లేదు. రైతులకు మాయ మాటలు చెప్పిన అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశాడు. రైతు భరోసా ఇస్తానని చెప్పి ఇప్పటివరకూ పూర్తిగా అమలుచేయలేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పంట పెట్టుబడి సాయం సకాలంలో వచ్చేది. ఫోన్‌కు టింగ్ టింగ్‌మంటూ మెస్సేజ్ వచ్చేది. రేవంత్ సర్కారు వచ్చినప్పటి నుంచి రైతుభరోసా లేదు. నాలుగు విడుతలుగా రావాల్సిన రైతుభరోసా మాకు ఒక్కసారి కూడా రాలేదు. ఇదేం ప్రభుత్వమో అర్థం కావడం లేదు.

\- దిలీప్‌పటేల్, రైతు, ఎత్తొండ

### రైతులకిచ్చిన హామీ ఏమైంది సారూ..?



ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ఏమైంది.? పంటలకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తానని గొప్పలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడేం మాట్లాడుతలేడు. వానకాలం మొదలైంది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలంటే పెట్టుబడి కావాలి. ఇంతవరకు రైతు భరోసా పత్తాలేదు..? అదే కేసీఆర్ సారూ ఉండగా పెట్టుబడి సాయం టైంకు వచ్చేది. వచ్చిన డబ్బులతో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే వాళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చి మోసం చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదు. ప్రభుత్వం మీద నమ్మకం పోయింది.


\- ఎం. దేవేందర్‌రావు, రైతు, ఎత్తొండ క్యాంప్

### కేసీఆర్ ఉన్నప్పడే మంచిగుండే..



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తానని చెప్పిన రైతుభరోసా ఎకరానికి రూ.15వేలకు బదులు రూ.12 వేలకు ఇస్తానని చెప్పారు. కానీ అది కూడా సక్కగా ఇస్తలేరు. నాలుగు విడుతలుగా ఇవ్వాల్సిన రైతుభరోసా ఒక్కసారి కూడా అమలు చేయలేదు. చేసిన వాటిలో సగం మందికి కూడా సక్రమంగా ఇవ్వాలేదు. నాకు 12 ఎకరాలు ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా రైతుభరోసా రాలేదు. కేసీఆర్ సారూ ఉండగా పెట్టుబడి సాయం సమయానికి వచ్చేది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు అన్ని రకాలుగా బాగుండే.

\- ఎస్. గోవిందు, రైతు, ఎత్తొండ క్యాంప్





# భరోసా లేని పథకం

- పెట్టుబడి సాయంపై అనుమానాలెన్నో
- అధికారంలోకి వచ్చాక ఎగ్గొట్టిన కాంగ్రెస్
- మొన్న యాసంగిలో తిరిగి ప్రారంభం
- అది కూడా అరకొరగానే అందజేత
- వానకాలం పనుల్లో నిమగ్నమైన రైతాంగం
- ఈ సీజన్‌లో పెట్టుబడి సాయంపై స్పష్టత కరువు
- రైతుభరోసా కోసం అన్నదాతల ఎదురుచూపు
- నోరు మెదుపని ప్రభుత్వం



నిజామాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో రైతుభరోసా పథకం అమలుకు భరోసా లేకుండా పోయింది. ఎన్నికల ముందర గొప్పలు చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రిక్త'హస్తం' చూపింది. కేసీఆర్ ఇస్తున్న దాని కంటే ఎక్కువే ఇస్తామని ఓట్లేయించుకున్న రేవంత్‌రెడ్డి.. గద్దెనెక్కాక హామీల ఎగవేతకు తెర లేపారు. ఎకరాకు ఏటా రూ.15 వేలు ఇస్తామని చెప్పిన సర్కారు.. మొదటి రెండు సీజన్లు పెట్టుబడి సాయం చేయకుండా ఎగ్గొట్టింది. బీఆర్ఎస్‌తో పాటు రైతుల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో మొన్నటి యాసంగిలో రైతుభరోసా పథకాన్ని ప్రారంభించింది. అదికూడా అరకొరగానే అమలు చేసి, సగం మంది రైతులకు ఎగ్గొట్టింది. ఇప్పుడు వానకాలం ప్రారంభం కానుంది. పంట సాగు పనుల్లో రైతాంగం నిమగ్నమైంది. అయితే, మొన్నటిసారే అంతంత మాత్రంగా పెట్టుబడి సాయం అందించిన ప్రభుత్వం.. ఈ సీజన్‌లోనైనా అందరికీ ఇస్తుందా? అసలు రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తుందా.. లేదా? అన్న సందేహం రైతుల్లో వ్యక్తమవుతున్నది.



**లక్షల మంది ఆశలపై నీళ్లు..**

పంట సాగులో రైతులకు పెట్టుబడి ఇబ్బందులు రావొద్దని గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మక రైతుబంధు పథకానికి 2023లో శ్రీకారం చుట్టారు. 2023 వానాకాలంలో నిజామాబాద్ జిల్లాలో 2082 లక్షల మందికి రూ.274 కోట్లు, కామారెడ్డి జిల్లాలో 2.90 లక్షల మందికి రూ.250 కోట్లు అందించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నాన్నన్నళ్లు మొత్తం 11 విడుతల్లో రైతులకు పెట్టుబడి సాయం అందించారు. కానీ, కాంగ్రెస్ వచ్చాక పరిస్థితి మారిపోయింది. రెండు సీజన్లలో రైతుభరోసా పథకాన్ని ఎగ్గొట్టింది. మొన్న యాసంగిలో సగం మందికే పెట్టుబడి సాయం ఇచ్చిన ప్రభుత్వం.. వానకాలం సాయంపై నోరు మెదపడం లేదు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూటకోమాట మాట్లాడుతుండటంపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. యాసంగికి సంబంధించి ఏప్రిల్‌లో అందరికీ రైతుభరోసా ఇస్తామని నిజామాబాద్ పర్యటనలోనే తుమ్మల చెప్పారు. మే నెలాఖరు వచ్చినా సగం మందికీ సాయం అందలేదు. తీరా ఇప్పుడు ఉచిత పథకాలంటూ తుమ్మల అక్కసు వెళ్లగక్కడంపై రైతాంగం మండిపడుతున్నది. ఉచితాల పేరిట రైతుభరోసాకు ఎగనామం పెట్టే యోచనలో కాంగ్రెస్ సర్కారు యోచిస్తుందేమోనన్న అనుమానం వ్యక్తమవుతున్నది. ముందస్తుగానే వర్షాలు పలుకరించడంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే ఈ సమయంలోనే పెట్టుబడి సాయం ప్రయోజనమని, లేదంటే అప్పులు చేయాల్సిన దుస్థితి తలెత్తుతుందని రైతులు వాపోతున్నారు.

**కాంగ్రెస్ ధోకా..**

రైతు డిక్లరేషన్ పేరిట సర్కార్ రైతులను దారుణంగా వంచించింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలేసింది. రూ.15 వేల రైతుభరోసా, అన్ని పంటలకు మద్దతు ధర, వడ్లకు రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ వంటి హామీలెన్నో ఇచ్చి, ఏ ఒక్కటీ సరిగ్గా అమలు చేయకుండా చేతులెత్తేసింది. రూ.2 లక్షల రుణమాఫీ సగం మందికీ కాలేదు. రైతుభరోసా రూ.12వేలకు కుదించినా, అది కూడా అందరికీ ఇవ్వలేదు. అన్ని పంటలకు మద్దతు ధర మాటలకే పరిమితమైంది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండే.. కాంగ్రెస్ వచ్చినంకనే మాకు కష్టాలు మొదలైనయని వాపోతున్నారు.

## ముందస్తు సాగు



ముందస్తు నాట్లు వేయడం బాన్సువాడ నియోజకవర్గంలో ఆనవాయితీగా వస్తున్నది. రాష్ట్రంలో అందరికంటే ముందే ఇక్కడి రైతులు సాగు పనులు మొదలు పెడతారు. వానకాలం సాగు కోసం అన్నదాతలు ఇప్పటికే నారు పోశారు. చందూరు, రుద్రూర్ తదితర మండలాల్లో ముందస్తు సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మరో వారం, పది రోజుల్లో నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

\- చందూర్, మే 26

## కలెక్టరేట్ ఎదుట ధర్నా



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జంగంపల్లి గ్రామస్తులు

### తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని జంగంపల్లివాసుల డిమాండ్

కామారెడ్డి, మే 26 : తమ కాలనీలో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 2008లో పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చారని తెలిపారు. వారు ఇండ్లు కట్టుకొని ఉంటున్నారని పేర్కొన్నారు. కొన్నిరోజులుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులతో కలిసి పేదలపై బెదిరింపులకు పాల్పడుతూ విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో ఇంకొందరు పేదలకు స్థలాలను దక్కకుండా చూస్తున్నారని, దీనిని మానుకోవాలని ఆయన హెచ్చరించారు. హైకోర్టు ఉత్తర్వులను కూడా ఖాతరు చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలుచేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నదన్నారు. కాంగ్రెస్ నాయకులు తమ తీరును మార్చుకోకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, నాయకురాలు నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై సర్కారు నిర్లక్ష్యం

**వారి కష్టాలను పట్టించుకోని రేవంత్ ప్రభుత్వం**

- కొనుగోలు ప్రక్రియలో అంతులేని జాప్యం
- వానలకు తడిసి ముద్దవుతున్న ధాన్యం
- వడ్ల కొనుగోళ్లపై సమీక్ష కరువు
- కేసీఆర్ పదేండ్ల పాలన.. రాష్ట్ర ప్రజలకు స్వర్ణయుగం
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



నందిపేట, మే 26 : రైతుల కష్టాలపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను గాలికొదిలేయడంతో రైతులు ఆగమాగమవుతున్నారని పేర్కొన్నారు. రైతులు కన్నీరుమున్నీరవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి కాస్తంతా కూడా కనికరం కూడా లేకుండా పోయిందని విమర్శించారు. యాసంగి పోయి వానకాలం వచ్చినా ధాన్యం కొనే దిక్కు లేదని పేర్కొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని పేర్కొన్నారు. పంట చేతికొచ్చే సమయంలో వడగండ్ల వానలు రైతులను నట్టేట ముంచాయని తెలిపారు. మామిడి పంటలు, కూరగాయలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న పంట కండ్ల ముందే నీటి పాలుకావడంతో రైతు కంట కన్నీరు కారుతున్నదన్నారు. వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తెలిపారు. 70 శాతం వరకు వడ్లు రాలిపోయిన పరిస్థితి నెలకొన్నదని, మరోపక్క కోసిన పంట కల్లాల్లో నీటిలో మునిగిపోయిందని పేర్కొన్నారు. పంట పొలాలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. సిరికొండ, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, వేల్పూర్, ఆర్మూర్, నందిపేట్, డిచ్‌పల్లి, భీమ్‌గల్, కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, దోమకొండ, భిక్కనూరు, నాగిరెడ్డిపేట్, బాన్సువాడ, జుక్కల్, పిట్లం, నిజాంసాగర్ తదితర మండలాల్లో భారీ వర్షం కురియడంతో పంటలు పూర్తిగా గింజ రాలిపోయిందని, దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

**ముఖం చాటేసిన అధికారులు**

ఎక్కడా కొనుగోలు కేంద్రాలు కనిపించడం లేదని, గన్నీ బ్యాగులకు దిక్కులేదని, ధాన్యం తరలించడానికి లారీలు లేవని తెలిపారు. అధికారులు ముఖం చాటేశారని, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదని పేర్కొన్నారు. 45 రోజులు అయినా కొనుగోళ్లు పూర్తి కాకపోవడం సిగ్గుచేటన్నారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించలేదని, అందాల పోటీల కోసం పదిసార్లు రివ్యూ చేశారని మండిపడ్డారు. కేసీఆర్ పదేండ్ల పాలన రైతులకు స్వర్ణయుగమని అభివర్ణించారు.

# పోచారం గ్రామస్తుల ఆందోళన


- అస్తవ్యస్తంగా రహదారి పనులు
- డ్రైనేజీ నిర్మించకపోవడంతో వర్షాలకు కూలిన పాఠశాల ప్రహరీ
- జలమయమైన స్కూల్ ఆవరణ
- పట్టించుకోని కాంట్రాక్టర్
- వాహనాలను అడ్డుకున్న స్థానికులు


నాగిరెడ్డిపేట, మే 26: మండలంలోని పోచారం గ్రామస్తులు నూతన రహదారిపై సోమవారం ఆందోళన చేపట్టారు. రోడ్డు పనులు చేపట్టిన కేపీసీ కంపెనీకి చెందిన వాహనాలను అడ్డుకొన్నారు. గ్రామంలో నెలరోజుల క్రితం నూతన రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీ వరకు పనులు చేపట్టారు. రోడ్డు పక్కన డ్రైనేజీని నిర్మించకపోవడంతో కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల ప్రహరీ కూలిపోయింది. దీంతో వర్షపు నీరు నిలిచి పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తున్నది. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ చెప్పి పదిరోజులవుతున్నా పట్టించుకోవడంలేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు సోమవారం పనులు చేపట్టిన కంపెనీకి సంబంధించిన వాహనాలను అడ్డుకొని, కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై మల్లారెడ్డి, పనులు చేపట్టిన కేపీసీ కంపెనీ సూపర్‌వైజర్ రామిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. వారం రోజుల్లో పాఠశాల ప్రారంభమవుతుందని, వెంటనే డ్రైనేజీతోపాటు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరారు. హైవే అధికారుల నుంచి అనుమతు వస్తేనే తాము డ్రైనేజీ, ప్రహరీ నిర్మిస్తామని సదరు సూపర్‌వైజర్ స్పష్టం చేశారు. గ్రామస్తుల సూచన మేరకు పాఠశాలలో నిలిచిన నీటిని పొక్లెయిన్ ద్వారా తొలగింపజేశారు. అనంతరం గ్రామస్తులు తహసీల్ ఆఫీస్ చేరుకొని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. డ్రైనేజీతో పాటు ప్రహరి నిర్మించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను కోరారు.



ప్రహరీ కూలిపోవడతో పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

# నేలకూలిన 83 ఏండ్ల కట్టడం





నేలమట్టమైన ఏడంతస్తుల మేడ

నందిపేట్, మే 26: మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామంలోని పురాతన ఏడంతస్తుల మేడ ఆదివారం రాత్రి నేలకొరిగింది. 1942లో గ్రామానికి చెందిన ఉత్తూర్ లచ్చయ్య దీనిని నిర్మించాడు. చుట్టుపక్కల గ్రామాల్లో ఎక్కడా ఇంతపెద్ద మేడ ఉండేది కాదు. ఈ పురాతన కట్టడం అప్పట్లో ప్రత్యేక ఆకర్షణగా ఉండేదని స్థానికులు చెప్పుకుంటారు. అప్పట్లో ఈ భవనంలోకి వెళ్లాలంటే 10 పైసలు తీసుకుని రానిచ్చే వారట. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు తడిసిన మేడ ఆదివారం రాత్రి కూలిపోయింది. నెల రోజుల క్రితమే లచ్చయ్య కుటుంబీకులు ఆ భవనాన్ని ఖాళీ చేశారు. లేకుంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. గ్రామానికి తలమానికంగా ఉన్న ఏడంతస్తుల మేడ నేలకూలడంతో గ్రామస్తులు దానిని చూసేందుకు తరలివచ్చారు.

# కుక్కల దాడిలో మరో జింక మృతి

కోటగిరి, మే 26 : వీధి కుక్కల దాడిలో మరో జింక మృతిచెందింది. పొతంగల్ మండలం సోంపూర్ గ్రామంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో ఓ జింక మృతిచెందగా.. సోమవారం కోటగిరి మండలం యాద్గార్‌పూర్‌లో మరో జింక మృతిచెందింది. అటవీశాఖ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 6 గంటల ప్రాంతంలో యాద్గార్‌పూర్ గ్రామంలోకి దారితప్పి ఓ జింక వచ్చింది. దీనిని గమనించిన వీధి కుక్కలు ఒక్కసారిగా జింకపై దాడి చేయగా స్థానికులు గమనించి కుక్కలను తరిమేసి జింకను రక్షించారు. దీనిపై సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకొని తీవ్ర గాయాల పాలైన జింకను చికిత్స నిమిత్తం కోటగిరి పశువైద్యశాలకు తరలించారు. స్థానిక పశువైద్యుడు సురేశ్‌కుమార్ జింకకు వైద్యం చేశారు. కానీ తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ జింక మృతి చెందినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.